
సాక్షి పశ్చిమగోదావరి

సోమవారం । 9 । జనవరి । 2023



ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

దెందులూరు : గాలాయగూడెంలో ఈనెల 28 నుంచి వచ్చేనెల 5 వరకు జరుగనున్న అచ్చమ్మ పేరంటాళ్ల తల్లి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.



బండి ముత్యాలమ్మకు పూజలు

మొగల్తూరు: ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయంలో విశేష పూజలు జరిగాయి.



పల్లకీ ఉత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పాతూరులోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారికి పల్లకీ ఉత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. విశేష పూజలు జరిగాయి.

న్యూస్‌రీల్

ఆకట్టుకున్న అష్టావధానం



పాల్గొన్న శతావధాని భరత్ శర్మ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో పోతనామాత్య పీఠం ఆధ్వర్యంలో అష్టావధానం నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో తిరుపతికి చెందిన అవధాన బాల భాస్కర శతావధాని ఉప్పలదడియం భరత్ శర్మ ముఖ్య అతిథిపాల్గొన్నారు. ఈ సందర్భంగా భరత్ శర్మ 37వ అష్టావధానం ఆహ్లాదంగా జరిగింది. విశ్రాంత సంస్కృత అధ్యాపకులు వీరుబోట్ల కుటుంబ సత్యనారాయణ, జోశ్యుల కృష్ణబాబు, విశాకపట్నం విశ్వనాథ సాహిత్య పీఠం అధ్యక్షుడు పేరాల సీతారామ ప్రభు, పోతనామాత్య పీఠం అధ్యక్షురాలు రేపాక లక్ష్మీబాయ్, గిడుగు శ్రీనివాసరావు, వాడపల్లి వేంకటాచార్యులు, నుదురుపాటి సీతాపతి, నందుల రామలింగేశ్వరుడు, చాగంటి లింగరాజు, కంభంపాటి కామేశ్వరరావు, అత్తిలి చల్లారావు తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెలలో ఓపెన్ డిగ్రీ పరీక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వచ్చేనెలలో నిర్వహించనున్నారని సీఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కేఏ రామరాజు, సమన్వయాధికారి వీఏఎస్ సతీష్ ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ప్రథమ సంవత్సరం సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 11 నుంచి, ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఫిబ్రవరి 20 నుంచి, తృతీయ సంవత్సరం పరీక్షలు ఫిబ్రవరి 27 నుంచి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. పరీక్ష ఫీజు చెల్లించడానికి ఈనెల 18 వరకూ గడువు ఉందని, అలాగే రూ.500 అపరాధ రుసుంతో ఫీజు చెల్లించడానికి ఈ నెల 25వ తేదీ వరకూ గడువు ఉందని పేర్కొన్నారు.

3.01 లక్షల టన్నుల ధాన్యం సేకరణ

ఏలూరు(మెట్రో) : ఏలూరు జిల్లాలో ఇప్పటివరకూ 3.01 లక్షల టన్నుల (79 శాతం) ధాన్యం సేకరణ పూర్తిచేసినట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. కొనుగోలు లక్ష్యం 3.84 లక్షల టన్నులు కాగా ఇప్పటివరకూ రూ.614 కోట్ల విలువైన ధాన్యం సేకరించామన్నారు. జిల్లాలో 284 రైతుభరోసా కేంద్రాల ద్వారా 42,549 రైతుల నుంచి సేకరించిన 3.01 లక్షల టన్నుల ధాన్యానికి రూ.614 కోట్లకు మిల్లర్ల వద్ద రశీదులు జనరేట్ అయ్యాయని, వీటిలో రూ.450 కోట్ల చెల్లింపులు జరిగాయని, రూ.164 కోట్లను బ్యాంకుల నుంచి చెల్లింపులు జరుగుతున్నాయని తెలిపారు. కూలీల చార్జీలుగా రూ.46.85 లక్షలు, గోనె సంచుల నిమిత్తం రూ.3.33 లక్షలు చెల్లించామన్నారు. రవాణా వాహనాలు సమకూర్చిన ఏజెన్సీలకు రూ.1.39 కోట్లు చెల్లించగా మరో రూ.43 లక్షల బిల్లులు చెల్లింపులకు సిద్ధంగా ఉన్నాయన్నారు. నిర్ణీత సమయంలోపు ధాన్యం సేకరణ పూర్తి చేయడంతో పాటు రైతులకు సకాలంలో చెల్లింపులు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

'లక్ష'ణమైన ధర



కొయ్యలగూడెం మండలం మారుమూల ప్రాంతంలో పెంచుతున్న పందెం కోళ్లు

కొయ్యలగూడెం: పుంజులు పందేలకు కాలుదువ్వుతున్నాయి. నువ్వానేనా అని తలపడేందుకు రెడీ అంటున్నాయి. కొయ్యలగూడెంలోని మారుమూల ప్రాంతంలో రెండున్నరేళ్లుగా మేలు జాతి రకం పుంజులను పెంచుతున్నారు. పెరూ దేశం నుంచి పందెం పుంజులను తీసుకువచ్చి వాటి ద్వారా పొదగబడి పుట్టిన పిల్లలను పెంచుతున్నారు. ముఖ్యంగా వాటిలో మేలు జాతి రకాలను వేరు చేసి పందేలకు సిద్ధం చేస్తున్నారు. పెరూ జాతి పుంజుల ద్వారా తయారైన మిశ్రమ జాతి పుంజుకు దేహదారుఢ్యం బాగుండటంతో వీటిని కొనేందుకు పందెగాళ్లు ఎగబడుతున్నారు. ఇక్కడ సుమారు 200కు పైగా మిశ్రమ జాతికి చెందిన పుంజులు ఉన్నాయి. రకాన్ని బట్టి రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షలకు పందెగాళ్లు వీటిని కొనుగోలు చేసి తీసుకువెళుతున్నారు. ఉభయగోదావరి జిల్లాలతో పాటు కృష్ణా, గుంటూరు, తెలంగాణ నుంచి వచ్చి మరీ కొంటున్నారు.

పేకాట శిబిరంపై దాడి

తణుకు: తణుకు మండలం తేతలి గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేశారు. గ్రామంలో ఒక ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో తణుకు రూరల్ సీఐ సీహెచ్ ఆంజనేయులు ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.23,700 నగదు, 11 సెల్‌ఫోన్లు, 6 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పక్కా ప్రణాళికతో పదిలం



- టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- నూరుశాతం ఉత్తీర్ణతకు విద్యాశాఖ కృషి
- ఉపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణ
- జిల్లాలో 20,619 మంది విద్యార్థులు



సాక్షి, భీమవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ 'ప్రత్యేక' కసరత్తు చేస్తోంది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో 396 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 20,619 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్నారు. రెండేళ్లుగా కోవిడ్ కారణంగా పాఠశాలలను సక్రమంగా నిర్వహించకపోవడంతో ఉత్తీర్ణత శాతం కూడా తగ్గింది. ప్రస్తుత విద్యాసంవత్సరం సక్రమంగా సాగడంతో కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ ఉత్తీర్ణత శాతం పెంచడంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ చదువుతున్న విద్యార్థుల్లో సుమారు 20 శాతం మంది సీ.డీ గ్రేడ్‌లలో ఉండటంతో వీరిపై ప్రత్యేక దృష్టి సారించి నూరుశాతం ఉత్తీర్ణతకు పక్కా ప్రణాళికను అమలు చేస్తున్నారు.

100 రోజుల ప్రణాళిక

విద్యార్థులకు ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాలల వెనులుబాటును బట్టి గంట చొప్పున అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. ఇందుకుగాను 100 రోజుల ప్రణాళికను రూపొందించారు. పాఠశాలలో ఒక్కో ఉపాధ్యాయుడికి 10 మంది విద్యార్థులను దత్తత ఇవ్వడంతో పాటు 10 మంది వెనుకబడిన విద్యార్థులతో కలిసి బాగా ఏ గ్రేడ్ విద్యార్థులు చదివేలా ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నారు. అలాగే సీ.డీ గ్రేడ్ విద్యార్థులకు సబ్జెక్ట్ ఉపాధ్యాయుడు ప్రత్యేకంగా నోట్స్‌ను తయారు చేసి రివిజన్ క్లాసులో చదివించేలా ఏర్పాటుచేశారు. ఇది సత్ఫలితాన్ని ఇస్తుందని ఉపాధ్యాయులు అంటున్నారు.

పుస్తకాల తనిఖీ

విద్యార్థుల వర్క్, నోట్ పుస్తకాలను ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు తప్పనిసరిగా తనిఖీ చేసి వాటిలోని తప్పులను సరిచేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. వీటిని నిరంతరం మండల విద్యాశాఖాధికారి, ఉపవిద్యాశాఖాధికారి పర్యవేక్షించాల్సి ఉంది. ఎక్కడైనా ఉపాధ్యాయులు సక్రమంగా తనిఖీ చేయకపోతే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. పరీక్షల్లో అవకతవకలు, అక్రమాలకు అవకాశం లేనందున విద్యార్థులు కష్టపడి చదివితే మంచి మార్కులు సాధించే అవకాశం ఉంది.

దాతల సహకారంతో అల్పాహారం

ప్రత్యేక తరగతులతో విద్యార్థులు ఎక్కువ సమయం పాఠశాలలోనే ఉండటంతో వారు అలసిపోకుండా ఉండేందుకు దాతల సహకారంతో మధ్యాహ్నం అల్పాహారం (స్నాక్స్) అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పాఠశాలల పరిధిలో కొందరు దాతలను గుర్తించి వారి ద్వారా స్నాక్స్ అందించేందుకు కృషి చేస్తున్నారు. గతంలో కూడా ఇదే మాదిరిగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపారు.

ప్రత్యేక శ్రద్ధతో..



జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణతకు కృషిచేస్తున్నాం. ఈ ఏడాది 20,619 మంది రెగ్యులర్, 3,834 మంది వన్ ఫెయిల్డ్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఉపాధ్యాయుల సహకారంతో ప్రత్యేక శ్రద్ధతో అదనపు తరగతులు నిర్వహించడంతో పాటు విద్యార్థులకు మధ్యాహ్నం అల్పాహారం (స్నాక్స్) అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సహకరించి తమ పిల్లల చదువుపై శ్రద్ధ చూపాలి.

– ఆర్.వెంకటరమణ, జిల్లా విద్యాశాఖాధికారి, భీమవరం

మేలు జాతి పశువులను సంరక్షించుకోవాలి

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- ముగిసిన జాతీయస్థాయి పశువుల పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

తాడేపల్లిగూడెం రూరల్: ప్రపంచ స్థాయిలో ఒంగోలు జాతి ఎద్దులకు ఎంతో గుర్తింపు ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలోని భారతీయ విద్యాభవన్స్‌లో మూడ్రోజులుగా జరిగిన జాతీయ స్థాయి ఆరో మేలు జాతి పశువుల అందాలు, పాల పోటీలు ముగింపు సభను ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి కొట్టు మాట్లాడుతూ మేలు జాతి పశు సంపదను వృద్ధి చేసి భావితరాలకు అందించాలన్నారు. ఔత్సాహిక పెంపకందారులకు ప్రధాన ఆలయాల్లోని గోశాలల నుంచి మేలు జాతి ఆవులను ఉచితంగా అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు మాట్లాడుతూ పెద్ద రైతులు మినహా చిన్న, సన్నకారు రైతులు పశుపోషణకు దూరంగా ఉంటున్నారని, వారందరినీ ప్రోత్సహించాలని అన్నారు. మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే, దేశీయ గోజాతి సంవర్ధక అసోసియేషన్ అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ మేలు జాతి గోవుల సంరక్షణలో భాగంగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మేలు జాతి పశువుల వీర్యాన్ని తాను ఉచితంగా అందిస్తున్నానన్నారు.

55 యూనిట్ల మంజూరు

పశుసంవర్ధక శాఖ రాష్ట్ర డైరెక్టర్ అమరేంద్ర మాట్లాడుతూ గోజాతి సంరక్షణ పథకంలో భాగంగా గతేడాది రూ.30 లక్షల విలువైన 55 యూనిట్లు మంజూరు చేశామని, ఈ ఏడాది మరో 55 యూనిట్లు మంజూరు చేస్తామన్నారు. ఆంధ్ర గోపుష్టి కార్యక్రమం ద్వారా విజయవాడలో అవుట్‌లెట్‌ను ఏర్పాటు చేసి దేశీయ గోజాతి ఉత్పత్తులను విక్రయిస్తున్నామని, త్వరలో అన్ని జిల్లాల్లో ఇవి అందుబాటులోకి రానున్నాయన్నారు. శాస్త్రవేత్త రాజీవ్‌కుమార్ జోషి, కామధేను యూనివర్సిటీ డీన్ భరత్ రాథోడ్, దేశీయ గోజాతి సంవర్ధక అసోసియేషన్ సభ్యుడు కేవీవీ సత్యనారాయణరాజు (అబ్బాయిరాజు), కొప్పాక వెంకటనారాయణ, ఉప్పలపాటి చక్రపాణి, పశుసంవర్ధకశాఖ అధికారులు డీఎం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మేలు జాతి అందాల పోటీల విజేతలు

- ఒంగోలు జాతి ఆవుల విభాగంలో.. కూనమనేని మాధవి, దేవభక్తుని సుబ్బారావు
- ఒంగోలు జాతి ఎద్దుల విభాగంలో.. నల్లమోతు వేణుగోపాల్, ఎం.బాలాజీ
- పుంగనూరు ఆవుల విభాగంలో.. బి.సతీష్, మల్లిపూడి వెంకట్రావు
- పుంగనూరు ఎద్దుల విభాగంలో.. అడబాల లక్ష్మీ నారాయణ (నాని), రెడ్డి సత్తిబాబు
- ముర్రా గేదెల విభాగంలో.. మల్లిపూడి వెంకట్రావు, టి.దుర్గాభవన్‌చౌదరి
- దేశీయ ఆవుల విభాగంలో.. బాలాజీ మానిక్‌రావు జాదవ్, దేవికాజ్ నార్వేడీలకు చెందిన పాడి పశువులు చాంపియన్, రిజర్వు చాంపియన్‌లుగా నిలిచారు.
- చాంపియన్‌లకు రూ.30 వేలు, రిజర్వు చాంపియన్‌లకు రూ.20 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.

పాల పోటీల విజేతలు

- ఒంగోలు జాతి ఆవుల విభాగంలో.. వేగుళ్ల మురళీ (మండపేట), రిమ్మలపూడి గుణశేఖర్ (రాజోలు), మల్లిపూడి వెంకట్రావు (నేలటూరు)కు చెందిన పాడి పశువులు వరుసగా మొదటి స్థానాల్లో నిలిచాయి.
- ముర్రా గేదెల విభాగంలో.. దేవభక్తుని సుబ్బారావు (కానూరు, కృష్ణా జిల్లా), చిలకపాటి రాజీవ్ (వీరవల్లి), టి.దుర్గాభవన్ చౌదరికి చెందిన పశువులు
- దేశీయ ఆవుల (అన్నిరకాలు) విభాగంలో.. ఎన్‌వీవీఎస్ శరణ్ (మండపేట), మల్లిపూడి వెంకట్రావు (నేలటూరు), బి.మణికంఠ సతీష్ (భీమవరం)కు చెందిన పాడి పశువులు విజేతలుగా నిలిచాయి.
- ప్రథమ బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.75 వేలు, తృతీయ బహుమతి రూ.50 వేల చొప్పున నిర్వాహకులు అందజేశారు.

నేటి నుంచి వరాల వెంకన్న పవిత్రోత్సవాలు



ఈడూరులో వరాల వెంకన్న

అత్తిలి : మండలంలోని ఈడూరులో వరాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్టు అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు తెలిపారు. తొలిరోజు 108 కలశాలతో జలాలను తీసుకురావడం, విష్వక్సేనపూజ, అంకురార్పణ, 10న గ్రామ ప్రదక్షిణ, ప్రధాన హోమం, తీరువీధి ఉత్సవం, మహాశాంతి హోమం, 11న కుంభారాధన, విశేష హోమం, మహాపూర్ణాహుతి, తిరుప్పావై సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

సంక్రాంతి జోష్



జ్యూయలరీ షాపులో..



చినఅమిరంలో పిండి వంటల తయారీ

- మార్కెట్లలో సందడి
- జోరుగా వస్త్ర, స్వర్ణ విక్రయాలు
- కిరాణా దుకాణాలు కిటకిట
- ఆర్డర్‌పై పిండి వంటల తయారీ

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లావ్యాప్తంగా సంక్రాంతి పండగ సందడి కనిపిస్తోంది. మరో వారంలో పెద్ద పండగ ప్రారంభం కానున్న నేపథ్యంలో మార్కెట్లు కళకళలాడుతున్నాయి. వస్త్ర, బంగారం, కిరాణా, పిండి వంటల దుకాణాల్లో వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. వస్త్ర, స్వర్ణ దుకాణాల్లో వ్యాపారం రూ.కోట్లపైనే జరుగుతోంది. పండగ సమీపిస్తున్న కొద్దీ కొనుగోళ్లు మరింత ఊపందుకుంటాయి.

వస్త్ర వ్యాపారం రూ.100 కోట్లు

ఏటా క్రిస్మస్, జనవరి 1, సంక్రాంతి పండగల సందర్భంగా జిల్లాలోని భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లు, ఆకివీడు తదితర పట్టణాల్లో వస్త్ర వ్యాపారం రూ.100 కోట్ల వరకూ జరుగుతుందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ఈఏడాదిలో ఇప్పటివరకూ రూ.40 కోట్ల వ్యాపారం జరిగినట్టు అంచనా. గ్రామాల్లోని చిన్న షాపుల నుంచి పట్టణాల్లోని పెద్ద మాల్స్ వరకూ వస్త్ర వ్యాపారం జోరుగా సాగుతోంది.

జ్యూయలరీదీ అదేజోరు

జిల్లాలో బంగారు ఆభరణాల వ్యాపారం జోరుగా సాగుతోంది. సంక్రాంతికి కొత్త అల్లుళ్లు, కోడళ్లకు బంగారు ఆభరణాలు పెట్టడం ఆనవాయితీ కావడంతో మధ్యతరగతి నుంచి ఉన్నత వర్గాల వరకూ జ్యూయలరీ వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. ఏటా పండగ సీజన్‌లో రూ.10 కోట్ల వరకూ వ్యాపారం జరుగుతుందని అంచనా. ఈ ఏడాది లో ఇప్పటిరవకూ రూ.4 కోట్ల మేర వ్యాపారం జరిగినట్టు వ్యాపారులు చెబుతున్నారు.



భీమవరంలో ఓ వస్త్ర దుకాణంలో..

కిరాణా దుకాణాలు కిటకిట

కిరాణా సరుకుల కొనుగోళ్లు భారీగా జరుగుతున్నాయి. పిండి వంటల తయారీతో పాటు ఈనెలలో గ్రామదేవతల జాతరలు ఉండటంతో కిరాణా వ్యాపారం జోరుగా సాగుతోంది. ఏటా సంక్రాంతి సీజన్‌లో జిల్లావ్యాప్తంగా రూ.50 కోట్లకు పైగా కిరాణా వ్యాపారం జరుగుతున్నట్టు అంచనా.

ఆర్డర్‌పై పిండి వంటలు

సంక్రాంతి పండగ కోసం జిల్లాలోని భీమవరం, చినఅమిరం, పెనుగొండ, పాలకొల్లు, తణుకు తదితర ప్రాంతాల్లో ఆర్డర్‌పై పిండి వంటల తయారీ ముమ్మరంగా సాగుతోంది. అరిసెలు, గొరి మిఠాయిలు, పూతరేకులు వంటివి పెద్ద ఎత్తున ఆర్డర్‌పై తయారు చేస్తున్నారు. ఈ వ్యాపారం కూడా బాగా జరుగుతోంది. ఏడాది మొత్తంలో సంక్రాంతి సీజన్‌లో పిండి వంటల తయారీకి డిమాండ్ బాగుంటుంది.

కొండా కోనల్లో.. సంక్షేమ సవ్వడిలో..

- మారుమూల గిరిజన గ్రామం మోదేలు
- అడవిబిడ్డలకు అందుతున్న పథకాలు
- విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతి

బుట్టాయగూడెం: దట్టమైన అటవీ ప్రాంతంలోని కొయిదా పంచాయతీ పరిధిలోని మోదేలు గ్రామ గిరిజనులకు ప్రభుత్వ పథకాలు పూర్తిస్థాయిలో అందుతున్నాయి. అయితే గ్రామం వేలేరుపాడు మండలంలో ఉండగా మండల కేంద్రానికి రావడానికి సుమారు 70 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. అయితే బుట్టాయగూడెం 25 కిలోమీటర్ల దూరంలోనే ఉండటంతో వీరంతా గ్రామాన్ని బుట్టాయగూడెం మండలంలో కలపాలని కోరుతున్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో కలిసిన ఈ గ్రామం సాంకేతికతకు దూరంగా ఉంది. పోలవరం ఎమ్మెల్యే బాలరాజు, ఎంపీ కోటగిరి శ్రీధర్ ప్రత్యేక దృష్టి సారించి గ్రామానికి విద్యుత్ సదుపాయంతో పాటు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. అయితే అటవీ శాఖ అధికారుల అభ్యంతరంతో విద్యుత్ పనులు నిలిచిపోయాయి.

102 మంది జనాభా

గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామంలో ఆరుగురికి పింఛన్లు, 14 మందికి అమ్మఒడి, 25 మందికి రైతు భరోసా పథకంలో లబ్ధి అందుతోంది. గ్రామంలో ఇటీవల తాగునీటి కోసం చేతిపంపును ఏర్పాటు చేశారు. గ్రామ జనాభా 102 మంది కాగా విద్యావంతులు 14 మంది. వీరికి పోడు వ్యవసాయమే ఆధారం. సుమారు 150 ఎకరాల్లో కంది, జొన్న, చోళ్లతో పాటు జీడిమామిడి పంటలు పండిస్తున్నారు.



నీరు తెచ్చుకుంటున్న గిరిజన మహిళలు

రూ.70 లక్షల మంజూరు

గతేడాది గ్రామానికి విద్యుత్ సౌకర్యం నిమిత్తం రూ.70 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. లంకపాకల నుంచి మోదేలుకు 6.3 కేవీ సామర్థ్యంతో సింగిల్‌లైన్ వేసేందుకు ప్రతిపాదించి సుమారు 8 కిలోమీటర్ల మేర 200 స్థంభాలతో లైన్ వేసేలా అధికారులు సర్వే చేశారు. ఆ సమయంలో అటవీ అధికారులు అభ్యంతరం చెప్పడంతో పనులు నిలిచిపోయాయి. విద్యుత్ లైన్‌లు వేయాల్సిన ప్రాంతం 70 శాతం జంగారెడ్డిగూడెం, 30 శాతం కుక్కునూరు అటవీ శాఖల పరిధిలో ఉంది. ఇదిలా ఉండగా రేపల్లె, రేగులపాడు అడ్డరోడ్డు నుంచి మోదేలు వరకూ రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.3 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.



మోదేలు గ్రామం

స్త్రీ నిధి రుణం.. ఉపాధికి ఊతం

● మహిళలకు ప్రభుత్వం చేయూత
● రూ.లక్ష వరకూ జీవనోపాధి రుణాలు
● రెండు జిల్లాల్లో ఇంతవరకూ రూ.162 కోట్లు అందజేత

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా మహిళల ఉపాధి కోసం అన్ని విధాలా చేయూతనిస్తోంది. స్త్రీనిధి పేరిట రుణాలు ఇస్తుండటంతో మహిళల్లో ఆనందాలు వెల్లివిరుస్తున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.340 కోట్ల రుణాలు అందించేందుకు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. మూడో త్రైమాసికం ముగిసే నాటికి రెండు జిల్లాల్లో ఇంతవరకూ రూ.162 కోట్ల జీవనోపాధి రుణాలు మంజూరు చేశారు. స్త్రీ నిధి రుణాలతో మహిళలు పెద్ద సంఖ్యలో వ్యాపారాలు ప్రారంభిస్తున్నారు. కుటుంబ పోషణ, పిల్లల చదువులు, ఇతర అవసరాల కోసం ఒకరి దగ్గర చేయి చాపకుండా తాము సంపాదించిన మొత్తం నుంచే ఖర్చు చేస్తున్నారు. దీంతో మహిళల్లో ఆత్మ విశ్వాసం వెల్లివిరుస్తోంది. ప్రభుత్వ సహకారం పట్ల ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలలోని మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రూ.162 కోట్ల రుణాలు అందజేత

2022–23 ఆర్థిక సంవత్సరంలో మూడో త్రైమాసికం పూర్తయ్యే నాటికి ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో దాదాపు రూ.162 కోట్ల మేరకు స్త్రీ నిధి సంస్థ ద్వారా జీవనోపాధి రుణాలను అందజేశారు. ఏలూరు జిల్లా పరిధిలో 10,043 డ్వాక్రా సంఘాల పరిధిలోని 40,198 మంది సభ్యులకు రూ.200.99 కోట్లు రుణాలు అందించాలనే లక్ష్యానికి మూడో త్రైమాసికం పూర్తయ్యే నాటికి 6,361 గ్రూపులకు చెందిన 21,712 మందికి రూ.84.94 కోట్లు రుణాలుగా అందజేసారు. పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో 6,937 గ్రూపులకు చెందిన 27,766 మందికి రూ.138.83 కోట్లు రుణాలు అందించాలనే లక్ష్యంగా నిర్దేశించారు. ఇంత వరకూ 5,895 గ్రూపులకు చెందిన 20,128 మందికి రూ.77.50 కోట్లు రుణాలుగా అందించారు.

రుణాలు అందించే విధానం

స్త్రీ నిధి రుణాలన్నీ బయోమెట్రిక్ పద్ధతిలో అందిస్తున్నారు. స్త్రీనిధి రుణాలకి ఎలాంటి దరఖాస్తు రుసుం, ప్రాసెసింగ్ ఫీజు లేదు. ఈ రుణాలపై ఎలాంటి అపరాధ రుసుం వసూలు చేయడం లేదు. స్త్రీనిధి రుణాలను ఆయా స్వయం సహాయక సంఘాల బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. స్త్రీనిధి నుంచి రూ.లక్ష వరకూ జీవనోపాధి రుణం పొందే అవకాశం ఉంది. ఈ రుణాలను 11 శాతం వడ్డీతో 12 నుండి 36 సమాన వాయిదాలలో చెల్లించవచ్చు.

స్త్రీనిధి రుణాల రకాలు

స్వల్పకాలిక రుణాలు: ఈ రుణం కింద రూ.10 వేల వరకూ పొందే అవకాశం ఉంది. దీన్ని 12 సమాన వాయిదాల్లో చెల్లించాలి

మైక్రో రుణాలు: ఈ రుణం కింద రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకూ పొందవచ్చు. 24 సమాన వాయిదాలలో చెల్లించాలి.

టైనీ రుణాలు: ఈ రుణం కింద రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ పొందవచ్చును. 36 వాయిదాలలో తిరిగి చెల్లించాల్సి ఉంది.


స్వీటు షాపు నడుపుతున్న నరసాపురం మండలం పసలదీవికి చెందిన జవ్వాది సుబ్బలక్ష్మి

స్త్రీనిధి రుణంతో జీవనోపాధి


నా జీవనోపాధికి స్త్రీనిధి రుణం అక్కరకు వచ్చింది. ఇంట్లో ఖాళీగా కూర్చుకోకుండా డ్వాక్రా రుణానికి అదనంగా జీవనోపాధి రుణం రూ.లక్ష తీసుకుని సొంతంగా కిరాణా వ్యాపారం చేస్తున్నాను. నా కుటుంబ అవసరాలకు సరిపడా సంపాదిస్తున్నారు. ప్రభుత్వ సాయంతో సొంత కాళ్ళపై నిలబడేందుకు అందిస్తున్న సహకారం మరువలేనిది.

పుసుపులేటి అశ్విని, దాసరిగూడెం, పెదపాడు మండలం

సొంతంగా వ్యాపారం


ప్రభుత్వం వివిధ రూపాల్లో అందిస్తున్న ఆర్థిక చేయూతకు అదనంగా స్త్రీనిధి సంస్థ ద్వారా జీవనోపాధి రుణం రూ.లక్ష తీసుకుని సొంతంగా ఇంటి వద్దనే పిండి మర ఏర్పాటు చేసుకున్నాను. దీంతో ప్రతి రోజు రూ.200 నుంచి రూ.500 వరకూ సంపాదిస్తున్నాను. ఖర్చులు పోనూ నెలకు రూ.10 వేలు ఆదాయం వస్తుంది.

ఎస్.హేమకుమారి, పాతూరు, భీమవరం మండలం

స్వయం సాధికారతకు దోహదం


మహిళల స్వయం సాధికారతకు జీవనోపాధి రుణాలు దోహదం చేస్తున్నాయి. స్వయం సహాయక సంఘాల సభ్యులకు స్త్రీనిధి సంస్థ జీవనోపాధి పొందేందుకు అవకాశం కలిస్తుంది. స్వయం సహాయక సంఘాల సభ్యులు వ్యాపారం గురించి నిర్దిష్ట ప్రణాళికతో వస్తే దానికి అనుగుణంగా నిధులు కేటాయింపు జరుగుతుంది.

ఆర్ విజయరాజు, పీడీ, డీఆర్‌డీఏ, ఏలూరు

రూ.77.50 కోట్ల రుణాలు అందజేత


ఈ ఆర్థిక సంవత్సరంలో పశ్చిమగోదావరి జిల్లాలో రూ.138.83 కోట్ల స్త్రీ నిధి ద్వారా రుణాలు అందించాలనేది లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. మొదటి మూడు త్రైమాసికాలు పూర్తయ్యే నాటికి రూ.77.50 కోట్లు రుణాలుగా అందజేశాం. జిల్లాలోని మహిళలు ఆర్థికంగా శక్తివంతులు అయ్యేలా స్త్రీనిధి జీవనోపాధి రుణాలు వినియోగించుకోవాలి.

ఎంఎస్ఎస్ వేణుగోపాల్, పీడీ, డీఆర్‌డీఏ, పశ్చిమగోదావరి జిల్లా

మహిళల ఆర్థికాభివృద్ధికి జీవనోపాధి రుణాలు


జిల్లాలో మహిళల ఆర్థికాభివృద్ధికి ఊతం ఇచ్చేలా స్త్రీ నిధి జీవనోపాధి రుణాలు దోహదపడుతున్నాయి. ప్రభుత్వం అందజేస్తున్న ఆసరా, చేయూత పథకాలతో పాటు డ్వాక్రా సంఘాలకు అదనంగా స్త్రీ నిధి జీవనోపాధి రుణాలు అందజేస్తున్నాం. దీంతో మహిళలు వ్యాపారాలను ప్రారంభిస్తూ స్వయం సమృద్ధి సాధిస్తున్నారు.

పి.శశికుమార్, ఏజీఎం, స్త్రీనిధి, ఏలూరు

క్లుప్తంగా

వేడుకగా ధనుర్మాస ఉత్సవం


ద్వారకాతిరుమల క్షేత్ర పురవీధుల్లో తొళక్క వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు, గోదాదేవి

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఉభయ దేవేరులతో శ్రీవారు తొళక్క వాహనంపై ఆదివారం క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా ఊరేగారు. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి అర్చకులు విశేష పుష్పాలంకారాలు చేశారు. ఆ తరువాత ప్రత్యేక పూజలు జరిపి, హారతులిచ్చారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ శ్రీవారి వాహనం ఆలయ ప్రధాన రాజ గోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. అశ్వ, గజ సేవలతో జరిగిన ఈ ఉత్సవం భక్తులకు కనువిందు చేసింది. అనంతరం ధనుర్మాస మండపంలో శ్రీవారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు.

అంతిమ విజయం ధర్మానిదే

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ


సర్పంచ్ చంద్రికను అభినందిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం గ్రామానికి సంబంధించి సర్పంచ్ ఎన్నికల రీకౌంటింగ్‌లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఉండ్రాజవరపు చంద్రిక విజయం సాధించడంపై ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ స్పందించారు. ధర్మమే విజయం సాధిస్తుందని మరోసారి రుజువైందన్నారు. 2021లో నిర్వహించిన పంచాయతీ ఎన్నికల్లో ఎన్నికల అధికారులు అవినీతికి పాల్పడి తెదేపా విజయం సాధించిందంటూ ఓట్ల లెక్కింపును తప్పుదారి పట్టించారని తెలిపారు. శనివారం నిర్వహించిన రీకౌంటింగ్‌లో విజయం సాధించిన చంద్రికను అభినందించారు. పారదర్శకంగా వ్యవహరించాల్సిన ఎన్నికల అధికారులు అవినీతికి పాల్పడటం రాజ్యాంగాన్ని అగౌరపరచినట్లేనని అన్నారు. జెడ్పీ ప్రధానోపాధ్యాయుడు ఏఎస్ఆర్ మూర్తి అవినీతికి పాల్పడినట్లు రుజువైందన్నారు. ఆ అధికారిపై చట్టపరమైన చర్యలు తీసువాలన్నారు.

గడపగడపకు సంక్షేమం


తాడేపల్లిగూడెం: మండలంలోని చినతాడేపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

కనులపండువగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు


త్యాగరాజ కీర్తనలను ఆలపిస్తోన్న గాయనీ గాయకులు

నూజివీడు: త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు పట్టణంలోని టీటీడీ కల్యాణమండపంలో ఆదివారం కనుల పండువగా సాగాయి. శ్రీ సత్య కూచిపూడి, జానపద నృత్య అకాడమీ, నూజివీడు కళావేదికల ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు ప్రదర్శించిన పలు సంగీత, నాట్య నివేదన కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పలువురు కళాకారులు ఆలపించిన పంచరత్న కృతులు మంత్రముగ్ధులను చేశాయి. ప్రముఖ సంగీత దర్శకులు వాసు ప్రదర్శించిన త్యాగరాజ గీతాల విభావరి ఆకట్టుకుంది. పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రముఖ, మృదంగ విద్యాంసులు దండమూడి సుమతి రామ్మోహన్, ప్రఖ్యాత నృత్య దర్శకుడు, నంది అవార్డు గ్రహీత డాక్టర్ కేవీ సత్యనారాయణ, ఆలయ సంప్రదాయ నృత్య ప్రవీణ ఓలేటి రంగమణిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. శ్రీ సత్య కూచిపూడి, జానపద నృత్య కళాశాల చైర్మన్ వేంపటి మోహన్ పర్యవేక్షణలో వీటిని నిర్వహించారు. నూజివీడు మున్సిపల్ చైర్ పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ, కోఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, నూజివీడు కళావేదిక ప్రతినిధి పి.కృష్ణ ప్రసాద్, ప్రముఖ వైద్యులు శరత్చంద్ర, శైలజ, హనుమంతరావు, పారిశ్రామికవేత్త మూల్పూరి లక్ష్మణస్వామి తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ద్వారకాతిరుమల: బాలిక అదృశ్యంపై ఆదివారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సత్తెన్నగూడెంకు చెందిన బాలిక తండ్రి కూలి పనులకు వెళ్తూ పెద్ద కుమార్తెను ఇంటి వద్ద ఉంచాడు. తిరిగి ఇంటికి వచ్చేసరికి కుమార్తె కనిపించలేదు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు పేరంపేట రోడ్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా ట్రాక్టర్‌పై ఇసుక తరలిస్తున్న ఎస్.రాంబాబును అరెస్టు చేయడంతో పాటు ట్రాక్టర్, ట్రక్కు, ఇసుకను సీజ్ చేసినట్లు తెలిపారు.

ఉత్సాహంగా ఫుట్‌బాల్ పోటీలు

ఏలూరు రూరల్: ఆదివారం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఏలూరు చంటి ఫ్రెండ్స్ ఫుట్‌బాల్ జట్టు ప్రథమస్థానం, జంగారెడ్డిగూడెం ఫుట్‌బాల్ క్లబ్ ద్వితీయ స్థానం, పల్లంట్ల జట్టు తృతీయస్థానం సాధించాయి. ఫ్యూచర్ ఇండియా ప్రతినిధి సరేళ్ళ నాగేశ్వరరావు పోటీలకు స్పాన్సర్స్‌గా వ్యవహరించారు. పోటీలకు 12 జట్ల క్రీడాకారులు తరలివచ్చారని ఫుట్‌బాల్ కోచ్ ఎండి సిరాజుద్దీన్ వెల్లడించారు. బహుమతి ప్రదానోత్సవంలో జిల్లా చీఫ్ కోచ్ బి.శ్రీనివాసరావు, ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యుడు ఆలీబాబా పాల్గొన్నారు.

కోడిపందేల బరులు ధ్వంసం


పామాయిల్ తోటలో బరులను ట్రాక్టర్‌తో ధ్వసం చేయిస్తున్న జంగారెడ్డిగూడెం సీఐ, ఎస్సైలు


పెదపాడు మండలంలో 12మందిని అరెస్టు చేసిన ఎస్ఈబీ సీఐ ప్రసాద్‌కుమార్, సిబ్బంది

జంగారెడ్డిగూడెం: ఎస్పీ రాహుల్ దేవ్ శర్మ, డీఎస్పీ కేవీ సత్యనారాయణ ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం సీఐ బాల సురేష్‌బాబు అధ్వర్యంలో ఎస్సై సాగర్ బాబు, సిబ్బందితో కలిసి సుబ్బమ్మపేట, శ్రీనివాసపురం ప్రాంతాలలో కోడి పందేల బరులను ధ్వంసం చేశారు. ట్రాక్టర్‌లతో దున్నించి, చుట్టూ ఏర్పాటు చేసిన కంచెలను తొలగించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ సురేష్‌బాబు మాట్లాడుతూ ఎవరైనా కోడిపందేలు గానీ పేకాటలు గాని నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే కోడి కత్తులు తయారు చేసే వారిని, గతంలో కోడిపందేలు వేసిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు.

కోడికత్తులు స్వాధీనం

జంగారెడ్డిగూడెం సీఐ మాట్లాడుతూ కోడికత్తుల తయారీ, అమ్మేవారిపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. జంగారెడ్డిగూడెం ఎస్సై, ఐడీ పార్టీ, సిబ్బందితో కలిసి జంగారెడ్డిగూడెం గరుఢ పక్షి నగర్‌లో తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ తనిఖీల్లో కోడికత్తులు కలిగి ఉన్న అద్దంకి వెంకటేశ్వరరావును అరెస్టు చేసి అతని నుంచి 258 కోడికత్తులు, కోడికత్తుల తయారీకి వినియోగించే యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

12 మంది అరెస్ట్

ఏలూరు టౌన్: కోడిపందేలు, జూదక్రీడలపై చర్యలు తప్పవని జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు తెలిపారు. ఎస్ఈబీ సీఐ ప్రసాద్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం సాయంత్రం కోడిపందేల శిబిరాలపై దాడులు చేశారు. పెదపాడు మండలం కలపర్రు శివారు దాసరిగూడెంలో దాడులు చేశారు. 12 మందిని అరెస్టు చేయగా వారి నుంచి రూ.11600 నగదు, 7 సెల్‌ఫోన్లు, 13 మోటారు సైకిళ్ళు, రెండు కోడిపుంజులు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

తాడేపల్లిగూడెం మండలంలో..

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వెంకట్రామన్నగూడెం, పెదతాడేపల్లి గ్రామాల్లో వేసిన కోడిపందేల బరులను రూరల్ ఎస్సై ఎన్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడిపందేలు, పేకాట, గుండాట వంటి జూదక్రీడలు నిర్వహించినా, స్థలాలు సమకూర్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

125 కోడి కత్తులు స్వాధీనం

దెందులూరు: పెదవేగి సీఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో దెందులూరు ఎస్సై వీర్రాజు దెందులూరులో 125 కోడికత్తులను స్వాధీనం చేసుకున్నారు. సంక్రాంతి సందర్భంగా తనిఖీలు నిర్వహిస్తుండగా, దెందులూరులో కోండ్రు సత్యనారాయణ వద్ద కోడికత్తులు గమనించారు. తహసీల్దార్ నాంచారయ్య సమక్షంలో హాజరుపరిచి కోడికత్తులను స్వాధీనం చేసుకున్నారు.

శోభనాచలస్వామి ఆలయ పూర్వ వైభవానికి కృషి

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు


ఆలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతోన్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: ఆగిరిపల్లిలోని శ్రీ శోభనాచలస్వామి ఆలయానికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఆగిరిపల్లిలోని ఆలయంలో దేవదాయశాఖ అధికారులు, గ్రామస్తులతో ఆదివారం ఆలయ అభివృద్ధిపై సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ దివ్య క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేసుకోవడానికి గ్రామస్తులందరూ కలిసికట్టుగా తోడ్పాటు అందించాలన్నారు. ముఖ్యంగా కింది నుంచి శోభనగిరి పైకి రోడ్డు మార్గాన్ని నిర్మించాలని నిర్ణయించామని, దీనికి ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ఘాట్ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతుందని, తద్వారా ఆలయం అభివృద్ధి చెందుతుందన్నారు. కొండపై రెండెకరాల స్థలం ఉందని, అందులో అతిథి గృహాలను నిర్మిస్తామన్నారు. శ్రీ శోభనాచలస్వామి ఆలయం ఆధ్వర్యంలో అన్నదాన ట్రస్టు ఏర్పాటు చేస్తామని, ఎవరైనా భక్తులు విరాళం ఇవ్వాలనుకుంటే అన్నదాన ట్రస్టు బ్యాంకు ఖాతాకు నగదు జమ చేయాలన్నారు. ఆలయం కొండపై ఉన్నందున రథసప్తమి సందర్భంగా నిర్వహించే స్వామి వారి కల్యాణం నిర్వహించే రోజుల్లో గ్రామంలోని పెద్ద కొట్టాయ్ వద్ద హుండీని ఏర్పాటు చేయాలన్నారు. అంతేగాకుండా కొండ దిగువన స్వామి వారి ప్రసాదం కౌంటర్‌లను ఏర్పాటు చేయాలన్నారు. రథసప్తమి కల్యాణ మహోత్సవాలను ఈనెల 22నుంచి ఫిబ్రవరి 1 వరకూ నిర్వహిస్తున్నామని, ఈ ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చేలా ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించాలన్నారు. ఆలయ ధ్వజ స్తంభాలకు తానే ఇత్తడి తొడుగులు చేయిస్తానని ఎమ్మెల్యే వెల్లడించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఏలూరు అసిస్టెంట్ కమిషనర్ రంగారావు, ఆలయ ఈవో భవానీ, ఇన్స్‌పెక్టర్ ఏ.శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ మశ్చా హరిబాబు, ఎంపీటీసీ సాదం గోపీనాథ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

210 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

మొగల్తూరు: అక్రమంగా తరలిస్తున్న 210 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు మండలంలోని కాళీపట్నం తూర్పుగ్రామంలో ఆదివారం ఉదయం పట్టుకున్నారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పి.శివరామ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లా చెరుకుపల్లి నుంచి కాకినాడ జిల్లా మండపేటకు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లుగా స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎస్పీ కరణం కుమార్‌కు వచ్చిన సమాచారం మేరకు మొగల్తూరు మండలం కాళీపట్నం తూర్పులో అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా నుండి వస్తున్న లారీని ఆపి తనిఖీచేయగా రూ 3.78 లక్షల విలువైన 210 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. బియ్యంతో పాటు లారీని సీజ్ చేశారు. డ్రైవర్ అద్దేపల్లి ఏసురత్నం, బియ్యం వ్యాపారి కంకటాల సతీష్, లారీ ఓనర్ కె.వెంకట మల్లికార్జునరావులపై కేసు నమోదు చేశామన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణంలో చిన అప్పారావు పేటకు చెందిన తానాల సత్యనారాయణ (56) స్థానిక సోమగుండం చెరువులో పడి అనుమానాస్పదంగా మృతి చెందినట్లు వన్‌టౌన్ ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. సత్యనారాయణ కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడని, ఈ క్రమంలో పట్టణంలోని సోమగుండం చెరువు చుట్టూ వాకింగ్ చేస్తూ ప్రమాదవశాత్తూ చెరువులో పడి మృతి చెందినట్లు అతని కుమారుడు కేశవనారాయణ ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం


వాకర్స్ నూతన కార్యవర్గం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ఎయిర్ స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ ఈ సంవత్సరానికి గాను నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం వాకర్స్ భవనంలో జిల్లా గవర్నర్ శనగన కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా కురుమళ్ళ వెంకటాచలం, కార్యదర్శిగా పాప్పాప్పుల కుమారస్వామి, కోశాధికారిగా పూతినీడి వెంకట పరమాత్మలు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు. కొత్త సభ్యులు మాట్లాడుతూ వాకర్స్ సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు. వ్యవస్థాపక అధ్యక్షుడు కూచిపూడి వెంకటకృష్ణారావు, వాకర్స్ కప్పుల నరసింహమూర్తి, ప్రవా శ్రీనివాస్, అనిల్‌కుమార్, వనచర్ల నాగేంద్రప్రసాద్, బాకా వెంకటేశ్వరరావు, మాకా శ్రీనివాసరావు, వాకర్స్ మహిళా అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి పాల్గొన్నారు.

రంగనాథ స్వామికి ముత్యాల హారతి


రంగనాథ స్వామి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ధనుర్మాసం 24వ రోజు పురస్కరించుకొని పట్టణంలోని రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో ఆదివారం రంగనాథస్వామి వారికి ముత్యాల హారతిని వెండి పళ్లాలతో సమర్పించారు. మహిళా భక్తులతో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు

ఇరగవరం : సంక్రాంతి పండుగ పురస్కరించుకుని గ్రామాల్లో తెలుగు సంప్రదాయాలను చాటి చెప్పేందుకు కన్నయ్య కుమ్ముదవల్లి, ఓగిడి, గోటేరు, గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీల్లో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా పల్లెటూర్లులలో పెద్ద ఎత్తున మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ యూత్ అధ్యక్షుడు కర్రి సుబ్బారెడ్డి, ఓగిడి నాయకులు గంటా అప్పారావు, గోటేరు కిషోరు, మెహర్ అన్సారి, కారుమూరి భారతి ఆయా గ్రామాల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని ఆలయంలో బొమ్మల కొలువు

పెంటపాడు: ధనుర్మాసం పురస్కరించుకొని పెంటపాడు బాలవేంకటేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అర్చకులు, భక్తుల ఆధ్వర్యంలో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి చీమలకొండ సాయి, అర్చకులు అగ్నిహోత్రం కిరణ్, కొడవటిగంటి జగన్నాథాచార్యులు, ధర్మకర్త సుధాకర్ పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు వీజేవీ శివకుమార్

తాడేపల్లిగూడెం (టీఓసీ): క్యాన్సర్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని ది ఎక్స్ సర్వీస్ మెన్ అసోసియేషన్ అధ్యక్షుడు వీజేవీ శివకుమార్ అన్నారు. నిట్ సమీపంలోని ఎక్స్ సర్వీస్ మెన్ కార్యాలయం వద్ద ఆదివారం విజయవాడ హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించారు. హాజరైన వారికి ఉచితంగా క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి, వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో 75 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉపాధ్యక్షుడు రామస్వామి, పీఆర్‌ఓ అంబటి కృష్ణ, సలహాదారులు సుబ్బారావు పాల్గొన్నారు.

పథకాల అమలులో జవాబుదారీగా ప్రభుత్వం

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- చినతాడేపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం


చినతాడేపల్లిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీతనంగా వ్యవహరిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెం మండలం చినతాడేపల్లిలో రెండో రోజు ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే జమ అవుతున్నాయన్నారు. నాడు జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే సంక్షేమ పథకాలు అందేవన్నారు. నేడు కుల,మత, పార్టీ, రాజకీయాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. సీఎం జగన్ ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో సమర్థవంతమైన పాలన అందిస్తోందన్నారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారు సైతం సీఎం పాలన పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇవేమీ చంద్రబాబుకు కనిపించడం లేదని విమర్శించారు. తాము ఏం చెప్పినా ప్రజలు గుడ్డిగా నమ్ముతారనే భ్రమలో చంద్రబాబు ఉన్నారన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారన్నారు. టీడీపీ, వైఎస్సార్ సీపీ పాలనను బేరీజ్ వేసుకుంటున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి ఓర్వలేక మతిభ్రమించి చంద్రబాబు బాదుడే బాదుడు, ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి వంటి కార్యక్రమాలను చేపడుతున్నారని విమర్శించారు. కందుకూరు, గుంటూరులో జరిగిన ఘటనల నేపథ్యంలో చంద్రబాబుకు కనీసం పశ్చాత్తాపం కనిపించడం లేదన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో-1పై చంద్రబాబు, పవన్ విమర్శలు మానుకోవాలన్నారు. సభలు, సమావేశాల విషయంలో ప్రభుత్వం పార్టీలకతీతంగా అనుమతులు ఇస్తుందన్నారు. చంద్రబాబు, పవన్‌కు మాత్రమే జీవో-1పై అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం ఆయన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు తీరును ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. పలువురు ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై స్పందిస్తూ తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా 26మంది చినతాడేపల్లిలోని లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల ఎంజాయ్‌మెంట్ పత్రాలు ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పానుకుమాటి శేషులత, సర్పంచ్ పిచ్చుకల రాజారావు, ఉప సర్పంచ్ చిట్టూరి కాశీవిశ్వనాథం, వైఎస్సార్ సీపీ నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, దృశ్య శ్రవణ అకాడమీ డైరెక్టర్ మానికొండ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు దూలపల్లి సత్తియ్య, మార్లపూడి సుబ్బారావు, నార్ని శంకరరావు, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, జడ్డు హరిబాబు, చిక్కాల సత్యనారాయణ, సర్పంచ్ రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, ములగాల సూర్యారావు, గుల్లపల్లి ధర్మరాజు, హరిదాసుల రవీంద్రకుమార్, యాళ్ళ రాజు, తహసీల్దార్ వైకేవీ అప్పారావు, ఎంపీడీవో ఎం.వెంకటేష్, ఏపీవో ఏవీవీఎస్‌వీ.ప్రసాద్, ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, ఏవో ఆర్ఎస్.ప్రసాద్, పీఆర్ ఏఈ జి.పవన్, కార్యదర్శి బిరుదుకోట రమేష్, టి.రవిచంద్ర సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యరంగంలో నైపుణ్యాన్ని సాధించాలి

తాడేపల్లిగూడెం అర్బన్: వైద్యరంగంలో నైపుణ్యాలను సాధించి ఉత్తమ సేవలందించాలని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక జీఆర్ రెడ్డి నేత్ర వైద్యశాలలో ఆప్తమాలజీ పోస్టు గ్రాడ్యుయేషన్ వైద్య విద్యార్థులకు నేత్ర వైద్యంపై బోధనా కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 15 వైద్య కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ నేత్ర వైద్యులుగా జీఆర్ రెడ్డి అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంతోపాటు వైద్యరంగాన్ని నాడు- నేడు కార్యక్రమంతో ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా అభివృద్ధి చేశారన్నారు. దీంతోపాటు ప్రతి గ్రామం, పట్టణాలకు ఫ్యామిలీ డాక్టర్‌ను ఏర్పాటు చేశారని అన్నారు. నేత్ర వైద్య బోధన కార్యక్రమానికి హాజరైన వైద్య విద్యార్థులు ప్రభుత్వ వైద్య శాలలల్లో సేవలందించేందుకు నైపుణ్యాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో నేత్ర వైద్యులు జీఆర్ సందీప్, ముప్పిడి సంపత్‌కుమార్, కొలుకులూరి ధర్మరాజు, వెలిశెట్టి నరేంద్ర, ఎం గిరి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రుక్మిణీ కల్యాణం


అత్తిలి వేణుగోపాలస్వామి ఆలయంలో రుక్మిణీ కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యాలు


అత్తిలిలో విశేష అలంకరణలో వేణుగోపాలస్వామి

అత్తిలి: స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం లక్షతులసి పూజ, రుక్మిణీ కల్యాణ మహోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం విష్ణు సహస్రనామ పారాయణం, పంచామృత కలశారాధన, భగవద్గీత పారాయణం, గోపూజ నిర్వహించారు. అనంతరం శ్రీస్వామివారికి పంచామృతాభిషేకం, సప్తనదీ జలాభిషేకం నిర్వహించి, విశేషంగా అలంకరించారు. మధ్యాహ్నం స్వామివారికి లక్ష తులసి పూజ, కుంకుమ పూజ, వివాహార్థులతో కాత్యాయని వ్రతం, సంతాన వేణుగోపాల మూల మంత్ర హోమ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి రుక్మిణీ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకుడు వాడపల్లి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేసారు. లోక కల్యాణార్థ శ్రీస్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ గర్నిపూడి సర్వేశ్వరరావు, కార్యనిర్వహణాధికారి పి.సూర్యనారాయణ, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రజకులకు రక్షణ కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న అద్దాల నరసింహారావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రజకులకు రక్షణ చట్టం కల్పించాలని నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక వృత్తిదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అద్దాల నరసింహారావు పేర్కొన్నారు. పట్టణంలో సంఘ కార్యాలయంలో సమావేశం ఆదివారం యండమూరి మహేష్ అధ్యక్షతన నిర్వహించారు. అద్దాల నరసింహారావు మాట్లాడుతూ రజకులు అనేక విధాలుగా ఇబ్బందులకు గురవుతున్నారని, తక్షణమే వారికి రజక చట్టం తీసుకువచ్చి ఆదుకోవాలని కోరారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ రజకులను ఎస్సీ జాబితాలో చేరుస్తామని తెలిపినట్లు గుర్తు చేశారు. అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్ర ప్రభుత్వానికి పంపాలని కోరారు. వివిధ శాఖలలో రజక వృత్తికి సంబంధించిన ఉద్యోగాల్లో అవకాశం కల్పించాలని, రజక వృత్తి చెరువులను కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తులసిబాబు, తణుకు త్రిమూర్తులు, వి.దానయ్య, అవిడి సత్యనారాయణ, నరమామిడి నాగేశ్వరరావు, కొత్తపల్లి సత్యనారాయణ, చేటపర్తి అచ్యుతరామయ్య పాల్గొన్నారు.

పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని ఎన్‌సీసీ అధికారి కేవీ గణపతిరావు అన్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎన్‌సీసీ విద్యార్థులతో ఆవరణలోని చెత్త చెదారాలను తొలగించారు. తాగునీటి కుళాయిలు వద్ద, తదితర ఇతర ప్రాంతాల్లో పరిసరాలను పరిశుభ్రం చేశారు. కేవీ గణపతిరావు మాట్లాడుతూ ఎన్‌సీసీ విద్యార్థులు చదువుతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని అన్నారు. 50 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు పథకాలు దోహదం


పైడిపర్రులో స్వయం సంఘాల మహిళలకు గొర్రెలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ, డీఆర్‌డీఏ పీడీ

తణుకుటౌన్: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి చెప్పారు. ఆదివారం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) పైడిపర్రులో నిర్వహించిన స్వయం ఉపాధి మహిళలకు గొర్రెల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల జీవనోపాధి కల్పన, ఉపాధి కల్పనకు సబ్సిడీతో కూడిన అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. అర్హులైన ప్రతి మహిళకు సంక్షేమ ఉపాధి కార్యక్రమాలు అందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుద్రా ధనరాజు, జిల్లా డీఆర్‌డీఏ పీడీ ఎస్ఎస్ఎస్ వేణుగోపాల్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకటప్రసాద్, మాజీ ఏఎంసీ వైస్‌ఛైర్మన్ ములగాల శ్రీనివాసు, జీవనోపాధుల డీపీఎం కుసుమ, వెలుగు ఏపీఎం ఎ.రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు జంగం ఆనంద్‌కుమార్, నాయకులు ముళ్లపూడి బాబూరావు, దుర్గాప్రసాద్‌తోపాటు పశువైద్యులు, వెలుగు సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తణుకు, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలకు చెందిన 46 మందికి ఒక్కొక్కరికీ రూ. 50 వేలు విలువైన గొర్రెలను పంపిణీ చేశారు.

డ్వాక్రా మహిళలకు గొర్రెలు పంపిణీ

అత్తిలి: మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వినూత్నమైన పథకాలను అమలు చేస్తున్నారని ఎంపీపీ మక్కాసూర్యనారాయణ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద డ్వాక్రా మహిళలకు రూ. 50వేలు విలువగల 10 గొర్రెలను ఆదివారం పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మహిళలకు ఉపాధి కల్పించి, తద్వారా ఆర్థికాభివృద్ధి సాధించే విధంగా గొర్రెలు, పెరటికోళ్లు వంటి వాటిని అందిస్తున్నారని అన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు సహకారంతో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మండలంలో విజయవంతంగా అమలు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సా ర్‌సీపీ నాయకులు సబ్బితి రాజేష్, డ్వాక్రా సీసీలు పాల్గొన్నారు.


అత్తిలిలో డ్వాక్రా మహిళలకు గొర్రెలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ మక్కా సూర్యనారాయణ

సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదిద్దాం

ఉండి: ఎన్నో సంక్షేమ కార్యక్రమాల ద్వారా బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదిద్దామని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జీ సుందర్‌కుమార్ అన్నారు. ఆదివారం పింఛన్ వారోత్సవాల ముగింపు సందర్భంగా ఉణుదుర్రులో కొత్తగా పింఛను మంజూరైన పలువురు లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేశారు. సుందర్‌కుమార్, పార్టీ గ్రామ అధ్యక్షుడు కూనపరాజు వర్మ తదితరులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించే పింఛన్ల ద్వారా ఎంతో మంది సంతోషంగా బతుకుతున్నారన్నారు. పింఛను తీసుకునే వృద్ధులు, అక్కాచెల్లెమ్మలు ముఖ్యమంత్రి తమ పెద్ద కొడుకు అంటూ ఆత్మీయంగా మాట్లాడుతున్నారన్నారు.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి


ట్రోఫీలను అందజేస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని ఉపముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రైతు బజార్ ఇండోర్ స్టేడియంలో నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్న షెటిల్ టోర్నమెంట్ ఆదివారం సాయంత్రం ముగిసింది. పోటీలలో విజేతలకు రాత్రి మంత్రి చేతుల మీదుగా ట్రోఫీలు అందజేశారు. నియోజకవర్గ పరిధిలో అండర్ 19 మెన్ సింగిల్స్, డబుల్స్ పోటీలు, ఉమెన్ అండర్ 19 సింగిల్స్, వివిధ వయస్సుల వారీగా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల గిరి, చెన్నా జనార్ధనరావు, పేరూరి కాశయ్య, గొర్రెల శ్రీనివాస్, ముప్పిడి సంపత్, అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.హరి, బాలాజీ, సోమ్‌బాబు, భుజంగం, దినేష్, బాపన్న, తదితరులు పర్యవేక్షించారు.

విజేతల వివరాలు

షెటిల్ టోర్నమెంట్ విజేతల వివరాలను నిర్వాహకులు ప్రకటించారు. మహిళల విభాగంలో బీఎస్ఎస్ లక్ష్మీ అనురాధ, సి.అభిషేక్త, బీవీఎన్ఎస్ కేథారేశ్వరీ, ఎం.హేమ అండర్ 19 బాలుర విభాగంలో ఎ.పవన్, పి.శ్రీకాంత్, మణిదీప్, 45 పైబడిన గ్రూపులో విన్నర్స్‌గా దూసనపూడి రమేష్, జి.మోహన్, రన్నర్స్‌గా ఎం.సోమ్‌బాబు, పి.భుజంగం, ఒపెన్ కేటగిరిలో అనంద్‌పాల్, నవీన్, బాలాజీ, పి.రెడ్డి, ఎంబీఎల్ నారాయణ, సత్యనారాయణ, శేషు, రామకృష్ణ, బెస్ట్ ప్లేయర్స్‌గా నాగేంద్ర, తేజ్ యశ్వంత్, అనిల్, మేగశ్యాం నిలిచారు.

సమస్యల పరిష్కార వేదిక 'గడపగడపకు మన ప్రభుత్వం'


తణుకులో పథకాల లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి (ఫైల్)


తణుకులో గడపగడపకు కార్యక్రమంలో సమస్యలు నమోదు చేసుకుంటున్న కమిషనర్ నాగేశ్వరరావు, డీఈఈ ఈశ్వరరెడ్డి(ఫైల్)

- వాడవాడలా మంత్రి కారుమూరికి ఘన స్వాగతం
- తణుకు నియోజకవర్గంలో రూ. 3.30 కోట్లతో 46 అభివృద్ధి పనులు

తణుకు అర్బన్: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రజా సమస్యలకు పరిష్కార వేదికగా ఉపయోగపడుతోంది. ప్రజానీకం తెలిపే సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా ఈ కార్యక్రమం నిలుస్తోంది. మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించిన ప్రాంతాల్లో ప్రజలు విన్నవించిన వీధిదీపాలు, పారిశుద్ధ్యం, పెన్షన్లు తదితర సమస్యలను ఆయన ఆదేశాల మేరకు అధికారులు వెంటనే పరిష్కరిస్తున్నారు. రహదారులు, డ్రెయినేజీలు వంటి నిర్మాణ పనులను టెండరు ప్రక్రియ పూర్తిచేసి నిర్మాణాలు ప్రారంభించారు. అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేసింది.

మంత్రి కారుమూరి ఆదేశాలతో...

తణుకు నియోజకవర్గంలోని తణుకు మునిసిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు ప్రజలతో మమేకవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేస్తున్నారు. ఇప్పటివరకు తణుకు నియోజకవర్గంలో రూ. 3.30 కోట్ల నిధులతో 46 అభివృద్ధి పనులు వివిధ దశలలో ఉన్నాయి. ఇందులో కొన్ని పనులు పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు.


తణుకులో నిర్మించిన సీసీ రోడ్డు

తణుకు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ఇలా..

ప్రాంతం	అభివృద్ధి పనుల సంఖ్య	కేటాయించిన నిధులు
తణుకు మునిసిపాలిటీ	25	రూ. 2.50 కోట్లు
ఇరగవరం మండలం	13	రూ. 40 లక్షలు
అత్తిలి మండలం	6	రూ. 20 లక్షలు
తణుకు మండలం	2	రూ. 20 లక్షలు

త్వరితగతిన పనులు పూర్తి చేస్తున్నాం



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తెలుపుతున్న సమస్యల ప్రకారం మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు ఆదేశాలతో పనులు పూర్తి చేస్తున్నాం. పారిశుద్ధ్యం, వీధి దీపాలు తదితర సమస్యలు తక్షణమే పరిష్కరిస్తున్నాం. నిర్మాణాలకు సంబంధించి ఇంజనీరింగ్ అధికారుల సహకారంతో నిబంధనల ప్రకారం టెండరు ప్రక్రియ పూర్తిచేసి వెంటనే పనులు ప్రారంభిస్తున్నాం. ఇప్పటికే తణుకు మునిసిపాలిటీ పరిధిలో 7 పనులను పూర్తిచేశాం.

– ఎస్.నాగేశ్వరరావు, మునిసిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్, తణుకు